# లకుమ

హిందీ మూలం

**బాలశౌరి రెడ్డి**

అనువాదం

**పి. రాజగోపాలనాయుడు**

ఎమెస్కో

# లకుమ

గాఢాంధకారం. వాన జల్లులు సన్నగా పడుతున్నాయి. కళ్లు పొడుచుకొన్నప్పటికీ కొంచెమైనా కనబడడంలేదు. అప్పుడొక ఆశ్వికుడు గుఱ్ఱంపై వేగంగా పోతున్నాడు.

దూరంగా కాంతి కిరణాలు ప్రసరిస్తున్నాయి. ఆశ్వికుడు కృతనిశ్చయంతో గుఱ్ఱాన్ని దౌడు తీయిస్తున్నాడు.

ప్రకృతి ప్రాంగణంలో నీరవత వ్యాపించివుంది. కేవలం గుఱ్ఱం డెక్కల చప్పుడు మాత్రమే వినిపిస్తోంది. హఠాత్తుగా ప్రభంజనం ఉద్ధృతమై అంధకారాన్ని చీల్చుకొంటూ వీస్తూవుంది. డెక్కల చప్పుడుకు అది తాళం వేస్తోంది. దిగంతాలవరకు శూన్యం విస్తరించి వుంది. రాను రాను శీతలవాయువు వీచనారంభించింది. ఆశ్వికుడు ప్రకాశ కిరణాల సమీపానికి వచ్చాడు. అప్పుడు గుఱ్ఱపు డెక్కలచప్పుడు స్పష్టంగా వినిపించింది. అశ్వపదఘట్టనల వల్ల ధరిత్రి అదిరిపోతోంది. తమస్సును పటాపంచలు చేసే జ్యోతిర్మయమైన దీప కాంతి ప్రసరిస్తోంది. అశ్వం మరింత దగ్గరకు వచ్చింది.

పవిత్ర సందేశాన్నిచ్చే దేవాలయ ఘంటానాదంతోపాటు, పురోహితుని మంత్రపాఠాలు ఉచ్చస్వరంలో వినపడుతున్నాయి. భావనారాయణస్వామి విశాల విగ్రహం దృష్టిగోచరమయ్యింది.

దేవాంగనలను కూడ తన లావణ్యంతో పరాజితులను చేయగల ఒక సుందరి దేవతార్చన చేస్తూ తన్మయత్వంతో నృత్యం చేస్తున్నది.

రాను రాను నృత్యం తీవ్రగతిని పొందుతున్నది.

అశ్వారోహి మందిర ద్వారం వద్దకు వచ్చి, హయం మీదినుంచి దిగాడు. అతడు చాల అలసిపోయి వున్నాడు. మందిరాన్ని చూడగానే తను "బాపట్ల" చేరుకొన్నట్లు గుర్తుకొచ్చింది.

తన ఎదుట వున్న భావనారాయణ విగ్రహాన్ని చూస్తూనే అతని మస్తకం అవనతమైంది. భక్తి భావంతో అతడు తన రెండు చేతులు జోడించి నమస్కారం చేశాడు.

మరుక్షణంలో అతడు – విద్యుల్లతలాగా నృత్యం చేస్తున్న ఒక సుందరిని తిలకించాడు.

అతని మస్తిష్కంలో ఏదో ఆలోచన మెరిసింది.

అశ్వారోహి మెరపులాగా దేవాలయం గర్భగృహంలో ప్రవేశించి ఆ కన్యను పై కెత్తుకొన్నాడు.

మరల కొంత సేపటికి గుఱ్ఱం డెక్కల చప్పుడు వినబడసాగింది.

వర్షం నిలిచిపోయింది. అంధకారం విచ్చిపోయింది. నక్షత్ర కాంతులు మార్గం చూపుతున్నాయి.

అశ్వం నిలిచిపోయింది. దానికి చెమటలు పోస్తున్నాయి. దాని నోటినుంచి నురుగు కారుతున్నది.

అశ్వారోహి దేహం కూడ అలసిపోతున్నది. అతని హస్తాలలో ఒకటి ఆ రమణీమణిని పట్టుకొని వుంది. మరొక చేయి కళ్లేన్ని గట్టిగాపట్టుకొని వుంది. యువతి మూర్ఛపోయి వుంది. ఒక గంట గడిచింది. సముద్రంలో ఒక వాగు గలగల ప్రవహిస్తున్నది. నీటిని చూస్తూనే గుఱ్ఱం నిలచిపోయింది. అశ్వారోహి యువతిని తీసుకొని కిందికి దిగాడు.

వాగు గట్టున పచ్చని గడ్డి మొలచివున్నది. అతడు తిన్నగా రమణిని ఆ పచ్చికలో పడుకోబెట్టాడు. తన దోసిలితో నీటిని తెచ్చి ఆమె ముఖంమీద చిలకరించాడు. రమణి అధరం కదిలింది. ఈ మారు ఆ అశ్వారోహి తన దోసిలినిండా నీరుతెచ్చి ఆమెమీద చల్లాడు. శీతల జలస్పర్శవల్ల అప్పుడామె పెదవులు విచ్చుకొన్నవి. జలం తాగడంవల్ల ఆ యువతికి స్పృహ వచ్చింది. భీతహరిణిలాగా చకితయై లేచి కూర్చున్నది. భ్రుకుటి ముడివడింది. రోషభరిత స్వరంతో గర్జించింది.

"నీవెవరు?"

"దేవీ! కోపపడవద్దు" – అశ్వారోహి శాంతస్వరంతో బదులు చెప్పాడు.

"స్త్రీని స్పృశించడానికి సిగ్గులేదా?"

"నిన్నవమానించడం నా వుద్దేశంకాదు దేవీ!"

"అయితే నన్నిక్కడికి తేవడంలోని ఉద్దేశం?"

"నేనిప్పుడు చెప్పలేను."

"చెప్పితీరాలి."

"నేను మొట్టమొదటనే నివేదించాను."

"అయితే నేను నీవెంట రాలేను."

"నీవు కష్టపడనక్కరలేదు, నేను నిన్ను అశ్వంమీద ఉచిత స్థానానికి చేరుస్తాను."

"ఎక్కడికి చేరుస్తావు?"

"ఎక్కడ నీ అవసరం ఎక్కువగా ఉంటే అక్కడికి."

"నేనెక్కడ దేవదాసిగా వున్నానో ఆ మందిరానికే నా అవసరం వుంది. నేను నా సర్వస్వాన్ని ఆ దేవాలయానికే అర్పించాను."

"అయితే కావచ్చు. కాని నా దృష్టిలో ఇంతకంటె మహత్కార్యానికి నీ అవసరం వుందనిపిస్తున్నది."

"నీవేమనుకొంటావో దానితో నాకవసరంలేదు. నేనేమనుకొంటానో అదే నాకు కావాలి. నా జీవితం గురించి, నా జీవితోద్దేశం గురించి ఆలోచించే అధికారం నాకుంది."

"నీ అధికారాన్ని నేను అవహేళనం చేయడంలేదు. కాని ఇప్పుడు నీవు నా అధీనంలో వున్నావు. ఇప్పుడు నామాటే చెల్లుబడి అవుతుంది."

"ఏమిటి? ఇది ఒక స్త్రీని అవమానించినట్లు కాదా? ఆమె ఇష్టాయిష్టాలకు విలువే లేదా?"

"దేవీ! ఇప్పుడు నేను నీ ప్రశ్నలకు సమాధాన మివ్వలేను. అందుకు నే నిప్పుడసమర్థుణ్ణి."

"అబలను మోసం చేసి హఠాత్తుగా ఎత్తుకొని రావడం క్షమించరాని అపరాధం."

"కావచ్చు. కాని నేనేమీ చేయలేను."

"నేనింక నీతో రాలేను."

"నీవు రాలేవు. నిజమే. నిన్ను తీసుకొని వెళ్లడానికి నేను సిద్ధంగా వున్నాను."

"పరస్త్రీపై బలప్రయోగం చేయడం నీకు లజ్జ అనిపించడంలేదా?"

"దేవీ! నీ మాటలు నా మీద ఏ మాత్రం ప్రభావం చూపడంలేదు. నీమాటలవల్ల ప్రయోజన మేమాత్రం లేదు. మారు మాట్లాడకుండా నాతో రావడానికి తయారుకమ్మని నిన్ను ఆదేశిస్తున్నాను."

"నా నిర్ణయం నేను నీకు తెలిపే వున్నాను."